క్లుప్తంగా

అధినేత దృష్టికి మణుగునూరు సమస్యలు



అధినేత జగన్‌ను కలిసిన ప్రేమ్‌బాబు, దేవదాసు

దెందులూరు: సమస్యల వలయంలో ఏలూరు జిల్లా మణుగూనూరు కొట్టుమిట్టాడుతోందని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి ప్రేమ్‌బాబు, దేవదాసు తీసుకువెళ్లారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో జగన్‌ను కలిసి గ్రామ సమస్యలను విన్నవించారు.

లారీల పార్కింగ్‌తో ప్రమాదాలు



రోడ్డు పక్కన నిలిపిన లారీలు

దెందులూరు: జాతీయ రహదారిపై లారీలు ఎక్కడబడితే అక్కడ నిలుపుదల చేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. హైవేపై లారీల పార్కింగ్‌ను అరికట్టేందుకు మొబైల్ టీమ్‌లు ఉన్నప్పటికీ పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దాబాల వద్ద లారీలు నిలుపుదల చేయవద్దని ఉన్న బోర్డులు పెట్టేందుకే పరిమితమవుతున్నారని, ఆగి ఉన్న లారీలు జోలికి వెళ్లడంలేదని విమర్శిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముగిసిన అంకమ్మ సంబరాలు



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ

దెందులూరు: కొవ్వలిలో అంకమ్మ సంబరాలు బుధవారం ముగిశాయి. కొవ్వలి రజక సంఘం అధ్యక్షుడు గోవాడ నాగరాజు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వలి మూడు కూడళ్ల సెంటర్‌లో మహా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. వైస్ ప్రెసిడెంట్ సేలం అప్పారావు, సెక్రటరీ గోవాడ శ్రీనివాసరావు, క్యాషియర్ గొల్లపూడి రమేష్, కమిటీ సభ్యులు గొల్లపూడి శ్రీను, గోవాడ దుర్గాప్రసాద్ ,కొల్లూరు సాయి, గోవాడ సాయి, గ్రామస్తులు ఉన్నారు.

ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు



కోలాటం ఆడుతున్న మహిళలు

దెందులూరు: చల్లచింతలపూడి పాటెమ్మ పేరంటాలు ఆలయంలో జాతర సందర్భంగా బుధవారం భక్తులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పాటెమ్మ పేరంటాల తల్లి ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు పెరుగ్గూడెం గ్రామ మాజీ సర్పంచ్ యలమర్తి హేమ లక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బాలల పుస్తక దినోత్సవం



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి రాంబాబు

దెందులూరు: అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని బుధవారం దెందులూరు గ్రంథాలయం, పోతునూరు గ్రంథాలయాల్లో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు ఝాన్సీ, రాంబాబులు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి పుస్తకాలు, గ్రంథాలు, పత్రికల పఠనం అలవాటు చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక దినోత్సవంపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఆధార్ సెంటర్లు

నిడమర్రు: ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ తీసుకునేందుకు గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.విజయకుమారి తెలిపారు. 3న తోకలపల్లి, 4న చిననింద్రకొలను, 5న పెదనింద్రకొలను గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నమన్నారు.

పాఠశాలల్లో నీటి గంట తప్పనిసరి

- రోజుకు మూడుసార్లు
- విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా చర్యలు



గుండుగొలను పాఠశాలలో సీసాలలో నీరు తాగుతున్న చిన్నారులు

గణపవరం: ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే వేసవి ఆరంభంలోనే ఎండలు భగ్గుమంటున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఉక్కబోత ప్రారంభమవుతుంది. మధ్యాహ్న సమయానికి ఎండతీవ్రత తారాస్థాయికి చేరుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గిపోయి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడుసార్లు వాటర్ బెల్ కొట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఎక్కడా నిర్లక్ష్యం చూపకుండా తప్పనిసరిగా నీటిగంట ఆదేశాలు అమలు చేయాలని విద్యాశాఖ గట్టి హెచ్చరికలు జారీచేసింది. ఉదయం 10, 11, 12 గంటలకు నీటి గంట కొట్టి విద్యార్థులు మంచినీరు తాగేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరికీ సురక్షిత నీరు అందుబాటులో ఉంచాలని, వాటర్ ప్లాంట్‌లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని, వాటర్ ప్లాంట్‌ల నుంచి సురక్షిత మంచినీటి డబ్బాలు అందుబాటులో ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ప్రస్తుతం ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. 8 గంటల నుంచి ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నానికి తారాస్థాయికి చేరుతుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో వాటర్‌బెల్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించింది.

పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గణపవరం	55	3,900
నిడమర్రు	41	2,350
ఉంగుటూరు	67	3,920
భీమడోలు	43	2,550

అందుబాటులో సురక్షిత నీరు

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మనబడి–నాడునేడు కార్యక్రమం అమలుచేసింది. పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలతో పాటు విద్యార్థులు సురక్షిత మంచినీరు తాగేలా నీటిశుద్ధి యంత్రాలను సరఫరా చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆర్వో ప్లాంట్‌ను మంజూరు చేసింది. ఉంగుటూరు నియోజకవర్గంలో 50 శాతం పాఠశాలల్లో ప్రభుత్వం మరికొన్ని పాఠశాలలో దాతల సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటుచేశారు. ప్రభుత్వం అందించిన ఆర్‌ఓ ప్లాంట్లలో కొన్ని మరమ్మతులకు గురికావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో రోజుకు 10నుంచి 15 వరకు వాటర్ టిన్నులు అందజేస్తున్నారు. ఇలాంటి అవకాశంలేని చోట్ల ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే వాటర్ టిన్నులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

తక్షణ మరమ్మతులకు ఆదేశం



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మూడు పర్యాయాలు వాటర్ బెల్ విధానం పటిష్టంగా అమలు చేస్తున్నాం. ఉదయం 10, 11, 12 గంటలకు తప్పనిసరిగా వాటర్‌బెల్ కొట్టి విద్యార్థులందరూ మంచినీరు తాగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ ప్లాంట్‌లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించాం.

– గొర్రెల బాలయ్య, ఎంఈఓ, గణపవరం

స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

పెదపాడు : మండలంలో స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పదపాడు మండలంలోని అప్పనవీడు, ఏపూరు, గోగుంట, గుడిపాడు, జయపురం కలపర్రు, కొక్కిరపాడు, కొణికి, కొత్తముప్పర్రు, కొత్తూరు, పాతముప్పర్రు, పునుకొల్లు, రాజుపేట, వడ్డిగూడెం గ్రామాలకు చెందిన దరఖాస్తు దారులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎండీ అమీలు జమా, ఈఓ ఆర్డీ సాధనాల సూర్యకుమార్ పాల్గొన్నారు.

నేడు నిడమర్రులో..

నిడమర్రు: స్వయం ఉపాధి సోపానం పథకం 2024–25 లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయ కుమారి తెలిపారు. ఉదయం 9 నుంచి క్రొవ్విడి, చానమిల్లి, సిద్ధాపురం, నిడమర్రు, మందలపర్రు, గుణపర్రు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

నిడమర్రు: ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్ కింద గురువారం కృష్ణాపురం గ్రామానికి సంబంధించిన భూముల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి చానమిల్లి రైతు భరోసా కేంద్రాం వద్ద రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈనెల 4న విస్తర్తి ఖండ్రిక భూములకు సంబంధించి ఎంపీయూపీ స్కూల్లో సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



అన్నేవారిగూడెంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల 67వ వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 1958వ సంవత్సరంలో ఏర్పడిన ఈ పాఠశాల అంచెలంచెలుగా యూపీ పాఠశాల స్థాయి చేరిందని, వరకు 1400 మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ పేర్కొన్నారు. 122 మంది విద్యార్థులతో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుందని, పాఠశాలకు కార్పొరేట్‌కు దీటుగా వసతులు సమకూరాయని సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ రహదారులు ప్రారంభం

ఉంగుటూరు: డెల్టా గ్రామాల్లో రూ.91.50 లక్షల వ్యయంతో వివిధ గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు బుధవారం ప్రారంభించారు. వీఏ పురంలో రూ.68 లక్షలతో వీఏపురం నుంచి కాకర్లమూడి బీటీ రోడ్డు నిర్మించారు. రూ.1.45 కోట్లతో కాకర్లమూడి – బొమ్మిడి బీటీ రోడ్డును, రూ.26 లక్షలతో గ్రామంలో అంతర్గత రహదారులను నిర్విహించారు. దొంతవరంలో రూ.80 లక్షలతో దొంతవరం నుంచి కాగుపాడు వరకు బీటీ రోడ్డు నిర్మించారు. గ్రామంలో రూ.8 లక్షలతో, సీతారామపురంలో రూ.12 లక్షలతో, రాచూరులో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి ఇంటర్వ్యూలు

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం స్వయం ఉపాధి పథకం దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దెందులూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సీజీఎస్ లక్ష్మీ దుర్గ, ఎంపీడీఓ కార్యాలయం రాజు, ఏపీఎం సురేష్ పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, తెలుపు, రూళ్ల నోటు పుస్తకాలు 12, గ్రూప్ లెక్చరర్‌ల సమక్షంలో కళాశాల లైబ్రేరియన్ ఐఎస్ఎన్‌రాజు ద్వారా పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన విద్యార్థులు కూడా కళాశాలకు హాజరు కావాలని, పుస్తకాలు తీసుకుని తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన కోరారు.

భక్తి మార్గంలో పయనించాలి



ఫాదర్ బాలను సత్కరిస్తున్న పాస్టర్లు

భీమడోలు: క్రైస్తవులంతా భక్తిమార్గంలో నడవాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ పి.బాల సూచించారు. పోలసానిపల్లి బేతేలు ప్రార్థన మందిరంలో బుధవారం పాస్టర్ జ్వాలా ఎఫ్రాయిము ఆధ్వర్యంలో శ్రమల కాల ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ బాల మాట్లాడుతూ ఆరు దినాలు కష్టపడి ఏడో దినం ఆదివారాన్ని ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో ప్రతిష్ఠించుకుని భక్తి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. పరిశుద్ధ హృదయంతో మందిరానికి వచ్చి దేవుని దీవెనలు, ఆశీర్వాదాలు పొందాలన్నారు. అనంతరం పాస్టర్లు శ్యాంసుందర్, ఇశ్రాయేలు, హరిఆబు, సాగర్‌లు వాక్య పరిచర్య చేశారు. అనంతరం శ్రమల కాల ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ బాలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వివిధ గ్రామాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీటీసీ పృథ్వీరాజ్ లేని లోటు తీరనిది



పృథ్వీరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: మాజీ మంత్రి, గాంధేయవాది చింతలపాటి మూర్తిరాజు వారసుడు మాజీ ఎంపీటీసీ పృథ్వీరాజ్ లేని లోటు తీరనిది అని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పత్తేపురంలో ఇటీవల మృతిచెందిన పృథ్వీరాజ్ కుటుంబ సభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి వాసుబాబు పరామర్శించారు. పృథ్వీరాజ్ చిత్రపటానికి వాసుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల వద్ద ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వాసుబాబు వెంట జెడ్పీటీసీ కోడే కాశి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాతూరి శ్రీనివాసరాజు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, యువజన విభాగం మండల కన్వీనర్ గోవింద రాజు, పార్టీ నేతలు సందీప్, పల్లి భాస్కరరావు తదితరులున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. కైకరం కేంద్రం–9లో ఎస్సీ, సీతారామపురం ఓసీ, వీఏపురం ఈబీసీ, చేబ్రోలు–1 ఓసీ, రావులపర్రు–2 ఎస్సీ, ఉంగుటూరు–3 బీసీ–డీకి రిజర్వు అయిన సహాయకుల పోస్టులకు ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ భీమడోలు వారికిఇ చేరేలా దరఖాస్తు చేయాలని కోరారు. వివాహిత మహిళలు అర్హులని, 2025 జూలై 1 నాటికి 35 సంవత్సరాల్లోపు వయసు ఉండాలని, కనీస విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలని అన్నారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలో పోతునూరు అంగన్‌వాడీ కేంద్రం–148లో ఎస్సీ, శ్రీరామవరం -2121లో ఎస్సీ, సత్యనారాయణపురం–119లో బీసీ–డీ, పోతునూరు–149లో బీసీ–డీ, మలకచర్ల–124లో ఎస్సీ, సానిగూడెం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీలకు రిజర్వు అయిన అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పెదపాడు ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సీడీపీఓ కార్యాలయం పెదపాడులో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

భీమడోలు: ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీకి గురువారం నుంచి ఈనెల 17 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు భీమడోలు ఐసీడీఎస్ పీఓ షాహనాజ్‌బేగం పేర్కొన్నారు. నిడమర్రు మండలం కాకరమిల్లి గ్రామంలో అంగన్‌వాడీ పోస్టు ఓసీ మహిళకు కేటాయించామని తెలిపారు. అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు భీమడోలు మండలం దుద్దేపూడి ఓసీ, భీమడోలు ఓసీ, ఎంఎంపురంలోని గొల్లలపేట ఓసీ, సూరప్పగూడెం–1 ఎస్సీ, పోలసానిపల్లి ఓసీ, ఉంగుటూరు మండలం కైకరం ఎస్సీ, సీతారామపురం ఓసీ, చేబ్రోలు–1 ఓసీ, రావులపర్రు–2 ఎస్సీ, ఉంగుటూరు–3 బీసీ–డీలకు కేటాయించారని తెలిపారు. నిడమర్రు మండలం తోకలపల్లి బీసీ–ఏ, డి.గోపవరం ఓసీ, వీఏపురం ఈడబ్ల్యూఎస్ వర్గానికి కేటాయించారని పేర్కొన్నారు.

లింగమయ్య హత్య దారుణం



ఎం సూర్యనారాయణ

దెందులూరు: రాప్తాడు నియోజకవర్గంలో కురుమ లింగమయ్య హత్య కోస్తా జిల్లాల్లో కురుముల మనోభావాలను తీవ్రంగా కలిసి వేసిందని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత, చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముదుగురి సూర్యనారాయణ అన్నారు. బుధవారం సోమవరప్పాడులో మాజీ సొసైటీ చైర్మన్ కురుమ సంఘం ఉపాధ్యక్షులు మేకల సాంబశివరావు నివాసంలో ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కరించుకోవాలే తప్ప భౌతిక దాడులు, హత్యలు ఎంతమాత్రం సరైనవి కాదని అన్నారు. గుంటూరు, కృష్ణ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది పైగా కురుమ కులస్తులు ఉన్నట్టు చెప్పారు. జిల్లా నాయకులు ఆలూరు సోమేశ్వరరావు, మాయ సత్యనారాయణ, వేరే సాంబశివరావు, జోగు తిరుపతి స్వామి, కొత్తూరు కురుమ సంఘనాయకులు ఆవల దుర్గారావు ఉన్నారు.

దివ్యాంగులకు వితరణ



దివ్యాంగులకు బియ్యం, పండ్లు అందిస్తున్న దాత

భీమడోలు: దివ్యాంగుల అభివృద్ధికి దాతలు సహకారంతో శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం అన్నారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని దాత దాట్ల సూర్యనారాయణరాజు అల్లుడు ఇందుకూరి సత్యనారాయణరాజు దివ్యాంగులకు సన్నబియ్యం, పౌష్టికాహారం అందజేశారు. ఆగడాలలంకకు చెందిన చిరు వ్యాపారి బొబ్బిలి శివతులసీరావు, శ్రావణి దంపతులు సేవా సమితి అభివృద్ధికి రూ.10 వేల సాయం అందించారు. దివ్యాంగులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో దాట్ల రామకృష్ణంరాజు, కేశవరాజు, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ పనితీరుపై సమీక్ష

ఏలూరు (టూటౌన్): ప్రతి రెండు నెలలకు ఒకసారి వన్ స్టాప్ సెంటర్ పనితీరును సమీక్షించాల్సి ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ ప్రజా వైద్యశాల ప్రాంగణంలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. వన్ స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలకు, బాలలకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఆసరా కల్పిస్తానరి, కుటుంబ వివాదాల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచి నేటి వరకు 202 కేసులను నమోదయ్యాయని, 427 మందికి వివిధ రూపాల్లో సహాయం చేశాని తెలిపారు. 45 మందికి న్యాయ, 54 మంది వైద్య, 47 మందికి పోలీస్ సాయం, 85 మందికి షెల్టర్ ఇచ్చినట్టు చెప్పారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు



బువ్వనపల్లిలో రోడ్డు ఆక్రమణలు తొలగిస్తున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ దాటి వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీరప్రసాద్ హెచ్చరించారు. బుధవారం బువ్వనపల్లిలోని మహాలక్ష్మి సెంటర్, బావాయిపాలెం – గణపవరం రహదారిలో ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను పోలీసులు తొలగించారు. రోడ్డు మార్జిన్ దాటి వ్యాపారాలు నిర్వహిస్తే కొనుగోలు చేయడానికి వచ్చే వారు రోడ్డుపై ద్విచక్రవాహనాలు, సైకిల్స్ నిలపడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి తరుచూ ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని వివరించారు. రోడ్డు మార్జిన్ దాటి వ్యాపారాలు నిర్వహించవద్దని దుకాణదారులకు ఎస్సై వీరప్రసాద్ కౌన్సిలింగ్ నిర్వహించారు.

పనుల పురోగతిపై సమీక్ష

ఏలూరు(మెట్రో): స్థానిక జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పంచాయతీ రాజ్ ఇంజినీర్ అధికారులతో సమీక్షించారు. జెడ్పీ నుంచి విడుదల చేసిన పనుల పురోగతిపై ఆరాతీశారు. జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వర్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు సురక్షితం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

దెందులూరు: సిజేరియన్ ఆపరేషన్ కన్నా సాధారణ ప్రసవాలు సురక్షితమని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకోవాలని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుందర్ బాబు అన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీ డాక్టర్లు పవన్, శాలిని, ప్రియాంక, అరవింద, హెడ్ సిస్టర్, ఏఎన్ఎంలతో కలిసి ప్లకార్డులు చేతబట్టి దెందులూరు హై స్కూలు, బస్టాండ్ సెంటర్, లైబ్రరీ సెంటర్, బ్యాంక్ సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. ప్రభుత్వం తల్లీ బిడ్డ క్షేమానికి లక్షలాది రూపాయలు వెచ్చించి అన్ని సౌకర్యాలు ప్రభుత్వ వైద్యశాలకు కల్పించినట్టు సూపరింటెండెంట్ సుందర్ బాబు తెలిపారు. గర్భిణీలకు విధిగా ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు.

పోలసానిపల్లిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

భీమడోలు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో పోలసానిపల్లి రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ షేక్ రహీమా బేగం బుధవారం ప్రారంభించారు. దివ్యాంగుల సంక్షేమానికి పాటు పడుతున్న సక్షమ్ సేవలు ప్రశంసనీయమని ఆమె అన్నారు. ద్వారకాతిరుమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు భీమడోలు రామకృష్ణ, పెద్దలు షేక్ హసేనా, ఉండి పెద్దిరాజు, ఉండ్రు బెంజిమన్, భీమడోలు జ్యోతిశ్రీ, కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

56 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్‌రెడ్డి పీజీ కళాశాలలో బుధవారం దివిస్ లేబరేటరీస్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాల కోసం వివిధ కళాశాలల నుంచి వచ్చిన 150 మంది యూజీ, పీజీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 56 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశామని కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధి ఎ.రాజేష్ తెలిపారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్ని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వం నిధు లు కేటాయించాలని, పుస్తకాలు కొనుగోలు చేయా లని గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ డిమాండ్ చేశా రు. వేదిక ఏలూరు జిల్లా ప్రతినిధుల సమావేశం బుధవారం సాయంత్రం స్థానిక ఫ్లాష్ టీమ్ కార్యాలయంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడారు.